అనంతపురం/శ్రీ సత్యసాయి
తెలుగు జాతీయ దినపత్రిక
వార్త
శుక్రవారం 07 అక్టోబర్ 2022
పేజీలు : 04

# అభివృద్ధి వికేంద్రీకరణే మా అజెండా

- ఒకచోటే అభివృద్ధి జరిగితే మిగిలిన ప్రాంతాల పరిస్థితేంటి ?
- రాయలసీమ, ఉత్తరాంధ్ర వెనుకబడి ఉండాలా ?
- రాష్ట్రంలో శకుని పాత్ర పోషిస్తున్న ప్రతిపక్షాలు
- అమరావతి శాసనరాజధానిగా ఉంటుంది
- ఉమ్మడి రాజధానిగా హైదరాబాద్‌ను ఎందుకు వదిలేశారు ?
- మూడు రాజధానులకు ప్రజల మద్దతు ఉంది
- అనంతపురం ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి స్పష్టీకరణ
- మల్లాలమ్మ దేవాలయంలో ప్రత్యేక పూజలు



టెంకాయ కొడుతున్న ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి

**అనంతపురం సిటీ, అక్టోబర్ 6 ప్రభాతవార్త**

ప్రజలకు సంక్షేమాన్ని అందిస్తూనే అభివృద్ధి వికేంద్రీకరణ చేయడమే తమ అజెండా అని అనంతపురం ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి తెలిపారు. అభివృద్ధి అంతా ఒకే చోట జరిగితే రాష్ట్రంలో మిగిలిన ప్రాంతాల పరిస్థితి ఏంటని ప్రశ్నించారు. రాష్ట్రంలో మూడు రాజధానుల ఏర్పాటుకు మద్దతు తెలుపుతూ వాటికి ఎదురవుతున్న అడ్డంకులు తొలగిపోవాలంటూ ఎమ్మెల్యే అనంత ఆధ్వర్యంలో ప్రజాప్రతినిధులు, పార్టీ శ్రేణులు నగరంలోని సూర్యనగర్ రోడ్డులో వున్న మల్లాలమ్మ దేవాలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఒక ప్రాంతం అభివృద్ధి మాత్రమే కోరుకునే వారి మనసులు మార్చాలని అమ్మవారిని వేడుకుంటూ ఆలయం ఎదుట కొబ్బరికాయలు కొట్టారు. అన్ని ప్రాంతాలు అభివృద్ధి చెందాలి, అందులో అమరావతి వుండాలి, వికేంద్రీకరణతోనే రాష్ట్ర సమగ్రాభివృద్ధి సాధ్యం అంటూ పార్టీ శ్రేణులు నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అనంత మాట్లాడుతూ 1953లో కర్నూల్ రాజధానిగా ఆంధ్ర రాష్ట్రం ఏర్పడిందని, 1956లో హైదరాబాద్ రాజధానిగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఆవిర్భవించిందన్నారు. అప్పటి నుండి హైదరాబాద్ కేంద్రంగా అభివృద్ధి అంతా కేంద్రీకృతం కావడంతో 2014లో రాష్ట్ర విభజన తరువాత వెనుబడిన రాయలసీమ ఉత్తరాంధ్ర ప్రాంతాలు తీవ్రంగా నష్టపోయాయని చెప్పారు. మరోసారి ఇలాంటి పరిస్థితి రాకుండా ఉండడానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికార, అభివృద్ధి, వికేంద్రీకరణకు నిర్ణయం తీసుకున్నట్లు చెప్పారు. ఇప్పటికే రాష్ట్రంలోని 13 జిల్లాలను 26 జిల్లాలుగా చేశారని గుర్తు చేశారు. రాష్ట్ర విభజన తరువాత 2014లో అధికారంలోకి వచ్చిన టిడిపి, బిజెపితో పాటు ఆ పార్టీలకు మద్దతుగా నిలిచిన జనసేన ప్రజలను తీవ్రంగా మోసగించాయని మండిపడ్డారు. ఐదేళ్ల అధికారంలో వుండి ఎలాంటి అభివృద్ధి చేయలేకపోయారని విమర్శించారు. అమరావతిలో జరుగుతోంది రియల్ ఎస్టేట్ వ్యాపారమేనని, అక్కడ పేద, మధ్య తరగతి ప్రజలు జీవించే పరిస్థితి లేదని చెప్పారు. పదేళ్ల హైదరాబాద్ ఉమ్మడి రాజధానిగా ఉండాల్సి వున్నా చంద్రబాబు ఎందుకు వదిలిపెట్టి వచ్చేశారన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌తోనే రాష్ట్ర సమగ్రాభివృద్ధి సాధ్యమన్నారు. భవిష్యత్తులో విభజన సమస్యలు రాకుండా వుండేందుకే విశాఖ కేంద్రంగా పరిపాలన రాజధాని, అమరావతి కేంద్రంగా శాసనరాజధాని, కర్నూల్ కేంద్రంగా న్యాయరాజధాని ఏర్పాటు చేయాలని సిఎం జగన్ నిర్ణయం తీసుకున్నారన్నారు. అమరావతి అభివృద్ధికి తాము కట్టుబడి వున్నామని, అందుకే అక్కడ శాసనరాజధాని ఏర్పాటు చేయాలనుకుంటున్నట్లు తెలిపారు. అందరూ బాగుండాలన్న ఆలోచనతో సంక్షేమ, అభివృద్ధి యజ్ఞం చేస్తుంటే ప్రతిపక్ష పార్టీలు రాక్షసుల్లా అడ్డుకుంటున్నారని వాళ్లకు మంచి బుద్ధి ప్రసాదించాలని అమ్మవారిని కోరుకున్నట్లు తెలిపారు. ప్రతిపక్షాలు మాత్రమే 26 జిల్లాల గురించి ఆలోచిస్తున్నాయని, మూడు రాజధానుల ఏర్పాటుకు ప్రజల మద్దతు వుందని ఎమ్మెల్యే తెలిపారు. ఈ కార్యక్రమంలో వైసిపి నగర అధ్యక్షులు చింతా సోమశేఖర్‌రెడ్డి, నగర పాలక సంస్థ మేయర్ మహమ్మద్‌వసీం, డిప్యూటి మేయర్లు వాసంతి సాహిత్య, కోగటం విజయభాస్కర్ రెడ్డి, పట్టభద్రుల ఎంఎల్‌సి అభ్యర్థి వెన్నపూస రవీంద్రారెడ్డి, మార్కెట్‌యార్డుచైర్మన్ ఫయాజ్, మాజీ మేయర్ రాగే పరశురాం, కార్పోరేటర్లు, వైసిపి నాయకులు, కార్యకర్తలు, వివిధ కార్పోరేషన్ల డైరెక్టర్లు పాల్గొన్నారు.

## మూడు ప్రాంతాలను సమానంగా అభివృద్ధి పరచాలి

- అభివృద్ధి వికేంద్రీకరణ సాధన సమితి



సమావేశంలో మాట్లాడుతున్న అభివృద్ధి వికేంద్రీ కరణ సమితి సాధన సమితి సభ్యులు దృశ్యం

**అనంతపురం, అక్టోబర్ 06, ప్రభాతవార్త బ్యూరో**

ఆంధ్రప్రద్ రాష్ట్రంలో మూడు ప్రాంతాలను సమానంగా అభివృద్ధి పరచాలని అభివృద్ధి వికేంద్రీకారణ సాధన సమితి రాష్ట్ర అధ్యక్షులు కె.వి.రమణ పాలక ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు రాష్ట్రంలో పర్యటించి చైతన్య సదస్సులు నిర్వహించి ప్రజలను చైతన్య వంతులను చేస్తామన్నారు. గురువారం స్థానిక ఆర్‌అండ్‌బి అతిథి గృహం నందు ఆయన విలేకరులతో మాట్లాడుతూ, అనాధిగా రాయలసీమ తీవ్రమైన అన్యాయం జరుగుతోందని, దాని పర్యవసానమే రాయలసీమలో వలసలు, ఆత్మహత్యలు అన్నారు. నాటి పాలకులు అభివృద్ధి అంతా హైదరాబాద్‌కుత ఈసుకోవడం మూలంగానే రాష్ట్రం రెండుగా చీలిపోయిందని, నవ్యాంధ్రప్రదేశ్ ఏర్పడిన తరువాత అయినా ఈ ప్రాంత నాయకులు, రాజకీయ పార్టీలు కళ్ళు తెరవకుండా మరలా పాతపద్ధతిలోనే నడుస్తున్నారని, దీని వల్ల రాబోయే కాలంలో రాయలసీమ మరింత గడ్డు పరిస్థితులు ఎదుర్కొలసి వస్తుందన్నారు. అందుకే ప్రభుత్వం ఏకకాలంలో అభివృద్ధిని మూడు ప్రాంతాలకు సమానంగా పంచాలని డిమాండ్ చేశారు. అప్పుడు అన్ని ప్రాతంతాలకు సమన్యాయం జరుగుతుందని, అభివృద్ధి ఒకే చోట కేంద్రీకరణ వల్ల ప్రాంతీయ అసమానతలు పెరిగి వేర్పాటు వాదానికి దారి తీస్తాయన్నారు. కావున రాయలసీమ ప్రాంతంలో గ్రామగ్రామాన అభివృద్ధి వికేంద్రీకరణ కోరుతూ చైతన్య సదస్సులు నిర్వహించాలని ఈ కార్యక్రమంలో విద్యార్థులు, మేధావులు, రైతులు, కూలీలు, మహిళలు, కవులు, కళాకారులు రాజకీయాలకు అతీతంగా పెద్ద ఎత్తున పాల్గొనాలని పిలుపునిచ్చారు. చైతన్య సదస్సుల తరువాత ఈ ప్రాంతానికి ద్రోహం తలపెట్టే రాజకీయ పార్టీలను అడుగుపెట్టబోనివ్వమనే ఉద్యమాలను తీసుకోబోతున్నామని అన్ని రాజకీయ పార్టీలను హెచ్చరించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో సాధన సమితి రాష్ట్ర అధ్యక్షులు కె.వి.రమణ, ప్రధాన కార్యదర్శి హనుమన్న, సమితి సభ్యులు అప్పి రెడ్డి, హరినాథ్ రెడ్డి, నబిరసూల్, అడ్వకేట్ సత్యనారాయణ రెడ్డి, శ్రీనివాసులు, అలీ, టీచర్ ఓబుళపతి, తదితరులు పాల్గొన్నారు.

## అంతరిక్ష వినియోగంలో

# భారత్ ప్రపంచ అగ్రదేశాల సరసన నిలుస్తోంది

- రాష్ట్ర గవర్నర్ బిశ్వభూషన్ హరిచందన్



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న గవర్నర్ దృశ్యం



సమావేశంలో మాట్లాడుతున్న గవర్నర్ బిశ్వభూషన్ హరిచందన్



భగవాన్ సత్యసాయి బాబా మహాసమాధిని దర్శించుకుంటున్న గవర్నర్ బిశ్వభూషన్ హరిచందన్

**శ్రీసత్యసాయి జిల్లా, అక్టోబర్ 06, ప్రభాతవార్త ప్రతినిధి:**

అంతరిక్ష వినియోగంలో భారతదేశం ప్రపంచ అగ్రదేశాల సరసన నిలుస్తున్నదని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గవర్నర్ బిశ్వభూషన్ హరిచందన్ పేర్కొన్నారు. బుధవారం పుట్టపర్తిలో నిర్వహించిన శ్రీసత్యసాయి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హయ్యర్ లర్నింగ్ 'వరల్డ్ స్పేస్ వీక్ సెలబ్రేషన్స్-2022 కార్యక్రమాన్ని గవర్నర్ జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో శ్రీహరికోట డైరెక్టర్ ఎ.రాజరాజన్, శ్రీసత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ ఆర్.జె.రత్నాకర్, శ్రీసత్యసాయి యూనివర్శిటీ ఛాన్స్‌లర్ చక్రవర్తి, జిల్లా కలెక్టర్ బసంత్‌కుమార్, వైస్ ఛాన్స్‌లర్ ప్రొఫెసర్ సి.వి.సంజీవి, ఆర్.సెంథిల్‌కుమార్, హిందూపురం పార్లమెంట్ సభ్యులు గోరంట్ల మాధవ్, స్థానిక శాసన సభ్యుడు దుద్దుకుంట శ్రీధర్ రెడ్డి తదితరులు ముఖ్యఅతిథులుగా పాల్గొన్నారు. అంతకు మునుపు గవర్నర్ ప్రశాంతి నిలయంలోని సాయికుల్వంత్ సభామందిరంలో భగవాన్ శ్రీసత్యసాయి బాబా మహాసమాధిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా గవర్నర్ మాట్లాడుతూ, అంతరిక్ష వారోత్సవాలు జరుపుకోవడం వెనుక లక్ష్యం అంతరిక్ష సాంకేతికతను మరియు దాని స్పష్టమైన ప్రయోజనాలను సామాన్య ప్రజలలో, ముఖ్యంగా విద్యార్థి సంఘంలో ప్రచారం చేయడం మరియు వ్యాప్తి చేయడమే ముఖ్య ఉద్దేశ్యమన్నారు. శ్రీసత్యసాయి జిల్లా కేంద్రమైన పుట్టపర్తిలో వరల్డ్ స్పేస్ వీక్ సెలబ్రేషన్స్-2022ను ప్రారంభించడం గర్వకారణంగా భావిస్తున్నానన్నారు. భారత అంతరిక్ష పరిశోధన సంస్థ(ఇస్రో) అంతరిక్ష శిథిలాలను పర్యవేక్షించడానికి ప్రాజెక్టు ఎన్ఇటిఆర్‌ఎని ప్రారంభించిందని ఇక్కడ పేర్కొనడం ఎక్కడలేని ఆనందాన్ని ఇస్తున్నదన్నారు. దేశీయా నిఘా వ్యవస్థ శిథిలాల స్థితిపై ప్రత్యక్ష సమాచారాన్ని అందిస్తున్నదని, ఇది అంతరిక్షాస్తులను రక్షించడంలో తదుపరి ప్రణాళికకు సహాయ పడుతుందన్నారు. కక్ష్యలో సేవలను అందించడానికి ఇస్రో 'ఎస్‌పిఎడిఇఎక్స్ అనే డాకింగ్ ప్రయోగాన్ని కూడా అభివృద్ధి చేస్తోందన్నారు. ఇప్పటికే ఉన్న ఉపగ్రహంపైన ఉపగ్రహాన్ని డాకింగ్ చేయడం రీ ఫ్యూయలింగ్ మరియు ఇతర ఇన్ ఆర్బిట్ సేవలలో మద్దతు ఇవ్వడం, ఉపగ్రహ సామర్థ్యాన్ని పెంచడం వంటివాటివల్ల మిషన్ యొక్క దీర్ఘాయువును నిర్ధారించడమేకాకుండా మిషన్లు, ప్రయోగాలను కలపడానికి దోహదపడుతుందన్నారు. ఐక్యరాజ్యసమితి 1999 జనరల్ అసెంబ్లీలో వరల్డ్ స్పేస్ వీక్‌ను ప్రతి సంవత్సరం అక్టోబర్ 04 నుండి అక్టోబర్ 10 వరకు నిర్వహించాలని ప్రకటించిందని, ఈ తేదీలు అంతరిక్ష పరిశోధనలో జరిగే రెండు మైలురాయి సంఘటనలను సూచిస్తాయన్నారు. 04 అక్టోబర్ 1957లో మానవ నిర్మిత భూమి ఉపగ్రహం ఎస్‌పియుటిఎన్ఐకె-1(స్పుతినిక్-1) ప్రయోగాన్ని మరియు 10 అక్టోబర్ 1967లో ఔటర్ స్పేస్ ఒపపందంపై సంతకం చేయడం, చంద్రుడు మరియు ఇతర ఖగోళ వస్తువులతో సహా బాహ్య అంతరిక్షం యొక్క శాంతియుత ఉపయోగాల అన్వేషణలో దేశాల కార్యకలాపాలను సూచిస్తుందన్నారు. ఆంధ్రప్రదేశ్‌లోని సతీష్‌ధావన్ అంతరిక్ష కేంద్రం, తమిళనాడు మరియు పుదుచ్చేరి రాష్ట్రాల్లో అంతరిక్ష కార్యకలాపాలను గరిష్టంగా చేరుకోవడానికి మరియు భారతీయ అంతరక్ష కార్యక్రమానికి సంబంధించి ప్రజలకు అవగాహన కల్పించడానికి వివిధ కార్యకలాపాలను నిర్వహిస్తున్నదన్నారు. ఈ యేడాది శ్రీహరి కోట, అమరావతి, పుట్టపర్తి, విజయనగరం, నెల్లూరు, చెన్నై, కారైకాల్, కటక్ వంటి ఎనిమిది వేదికలలో ఈ మూడు రాష్ట్రాన్ని అన్ని పోటీలు ఆన్‌లైన్ మరియు ఆఫ్‌లైన్ పద్ధతులలో జరిగాయన్నారు. ఈ వేడుకల వెనుక ఉన్న లక్ష్యం మరింత ప్రభావవంతంగా లక్ష్యాన్ని చేరుకునేలా పోటీలు ఇన్వహించేందుకు ఆర్గనైజింగ్ కమిటీ సభ్యులు చేస్తున్న కృషిని అభినందిస్తున్నానన్నారు. ఇస్రో ప్రాథమిక దృష్టి సామాన్యులకు మరిన్ని ప్రయోజనాలను సాధించడంలో భాగంగా విపత్తు నిర్వాహణ, వాతావరణ అంచనా, మత్స్యకారులకు సముద్ర నావిగేషన్, ఓషనోగ్రఫీ, టెలిమెడిసిన్, టౌన్ ప్లానింగ్, కమ్యునికేషన్, డిటిహెచ్ మొబైల్ ఫోన్‌లకు కనెక్టివిటీ మొదలైన అనేక ఉపగ్రహాలను ప్రయోగించడం ద్వారా ఇస్రో గత కొన్ని సంవత్సరాలుగా ప్రశంసనీయమైన సేవలను అందించడం హర్షణీయమన్నారు. భారతీయ గగనౌట్‌ని అంతరిక్షంలోకి పంపాలనే మన ప్రధాన మంత్రి నరేంద్రమోడి కలను సాకారం చేసేందుకు ఎస్‌డిఎస్‌సి, షార్, ఇస్రోలు అవిశ్రాంతంగా కృషి చేస్తున్నాయని తెలియజేసేందుకు సంతోషిస్తున్నానన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీసత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ సభ్యులు, పుట్టపర్తి ఆర్‌డిఓ భాగ్యరేఖ, ధర్మావరం ఆర్‌డిఓ తిప్పేస్వామి, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

## 48 హెచ్‌ఎం పోస్టులు రద్దు...
## 70 కొత్త పోస్టులు మంజూరు...!

పోస్టులు రద్దుకు ఆ హెచ్‌ఎంలు, టీచర్ల నిర్లక్ష్యమే ప్రధాన కారణం



ఇదే హెచ్‌ఎం పోస్టు రద్దు అయిన గాండ్లపర్తి జెడ్పీ హైస్కూల్

**అనంతపురం న్యూటౌన్, అక్టోబర్ 6 ప్రభాతవార్త**

రోజు రోజుకు పాఠశాలను అభివృద్ధి చేసుకుంటూ...కొత్త పోస్టులు మంజూరు అయ్యేలా బాధ్యాతయుతంగా పని చేయాల్సిన బాధ్యత ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులదే. కానీ వీరంతా విధులు పట్ల నిర్లక్ష్యం చేయడం వలన కొత్త మంజూరు కాకపోగా ఉన్న హెచ్‌ఎం, పిడి పోస్టులు రద్దు కావడం గమనార్హం.

జాతీయ విద్యా విధానం-2022లో భాగంగా రాష్ట్ర విద్యాశాఖ రేషనలైజేషన్ ప్రక్రియను చేపట్టింది. ఉమ్మడి అనంతపురం జిల్లాలో దాదాపు 400లకు పైగా హైస్కూల్స్ వున్నాయి. ఈ ఎడాది ఆగస్టు 31వ తేదీ నాటికి 3వ తరగతి నుంచి 10వ తరగతి వరకు 137 మంది కంటే తక్కువ విద్యార్థులున్న ఉన్నత పాఠశాల హెచ్‌ఎం పోస్టుతో పాటు పిడి పోస్టును రద్దు చేశారు. అలాగే 6వ తరగతి నుంచి 10 తరగతి వరకు 97 మంది విద్యార్థుల కంటే తక్కువ ఉన్న ఉన్నత పాఠశాలలో కూడా హెచ్‌ఎం, పిడి పోస్టులను రద్దు చేశారు. ఇలా 48 ఉన్నత పాఠశాలల హెచ్‌ఎం, పిడి పోస్టులను రద్దు చేశారు. హెచ్‌ఎం, పిడి పోస్టులు రద్దు అయిన పాఠశాలల హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు విద్యార్థుల సంఖ్యను పెంచుకోకుండా, విధుల పట్ల నిర్లక్ష్యం చేయడం, ఎక్కువ రోజులు ఓడిపై ఉండటం వలన ఆ పోస్టులు రద్దు అయ్యాయని పలువురు హెచ్‌ఎంలు, పలువురు ఉపాధ్యాయులు చర్చించుకుంటున్నారు. ఉదాహరణకు రాప్తాడు మండలం గాండ్లపర్తి జెడ్పీహెచ్‌ఎస్ హెచ్‌ఎం ఎక్కువ రోజులు ఓడిపై ఉండటం వలన ఆయన పోస్టుతో పాటు పిడి పోస్టు కూడా రద్దు అయ్యింది. ఆ హెచ్‌ఎం ప్రస్తుతం ఏపి హెడాస్టర్స్ అసోసియేషన్ అనంతపురం జిల్లా అధ్యక్షులుగా పనిచేస్తుండటం విశేషం. ఈ స్కూల్‌తో పాటు అనంతపురం రూరల్ మండలంలో మన్నీల, ఆలమూరు ఉన్నత పాఠశాలల్లో కూడా హెచ్.ఎం., పి.డి. పోస్టులు రద్దు కావడం జరిగింది. విద్యాశాఖ ఆ 48 పాఠశాలలను సక్సస్ పాఠశాలల క్రింద 2009లో ఎంపిక చేసి హెచ్‌ఎం, పిడి పోస్టులను మంజూరు చేసింది. ఆ పాఠశాలల హెచ్‌ఎం, ఉపాధ్యాయులు పాఠశాలలను బాగా అభివృద్ధి చేసుకోవడంలో విఫలం కావడంతో మంజూరైన 13 ఏళ్లకే ఆ పోస్టులు రద్దు కావడం గమనార్హం.

**70 కొత్త హెచ్‌ఎం పోస్టులు మంజూరు :**

నూతన విద్యా విధానంలో భాగంగా రేషనలైజేషన్ ప్రక్రియలో అనంతపురం ఉమ్మడి జిల్లాలో 48 ఉన్నత పాఠశాలల్లో హెచ్‌ఎం పోస్టులు రద్దు అయ్యాయి. ఈ నేపథ్యంలో రాష్ట్ర విద్యాశాఖ 70 కొత్త హెచ్‌ఎం, పిడి పోస్టులను మంజూరు చేసింది. ఆ కొత్త పోస్టులకు ఆర్థికశాఖ ఆమోదం తెలిపిందని తెలిసింది. అందుకు సంబంధించి ఉత్తర్వులు వచ్చాయి. కాగా కొత్తగా మంజూరైన 70 హెచ్‌ఎం పోస్టులలో ఆ హెచ్‌ఎంలకు 48 పోస్టులు కేటాయించి, ఖాళీగా ఉన్న 71 పిఎస్‌హెచ్‌ఎం పోస్టుల నుంచి అప్‌గ్రేడ్ చేసిన 22 పోస్టులను, ఇప్పటికే ఖాళీగా ఉన్న 20 పోస్టులు మొత్తం 42 పోస్టులను స్కూల్ అసిస్టెంట్లకు పదోన్నతులు ఇచ్చి భర్తీ చేయనున్నారు. త్వరలో పదోన్నతులకు సంబంధించి ఆన్‌లైన్ కౌన్సిలింగ్ నిర్వహించనున్నారు. ఆ దిశగా ఉమ్మడి జిల్లా విద్యాశాఖ అధికారులు కూడా కసరత్తు చేస్తున్నారు.

**అంతా నిబంధనల ప్రకారంగానే చేశాం : డీఈవో కె.శామ్యూల్**

రాష్ట్ర విద్యాశాఖ రూపొందించిన నిబంధనల ప్రకారంగానే ఆ 48 ఉన్నత పాఠశాలల్లో హెచ్‌ఎం, పిడి పోస్టులు రద్దు అయ్యాయి. కొత్తగా 70 హెచ్‌ఎం పోస్టులు కూడా మంజూరయ్యాయి. ఆ 48 మందికి పోస్టులు కేటాయించి పిఎస్‌హెచ్‌ఎం పోస్టులు నుండి అప్‌గ్రేడ్ అయిన 22, ఖాళీగా ఉన్న మరో 20 మొత్తం 42 పోస్టులను త్వరలో స్కూల్ అసిస్టెంట్లకు మేనేజ్‌మెంట్ల వారీగా పదోన్నతులు కల్పించి భర్తీ చేస్తాము.

## తాడిపత్రిలో ట్రాఫిక్ పోలీసుస్టేషన్

# నూతన భవన నిర్మాణానికి భూమిపూజ

- భూమిపూజ చేసిన జిల్లా ఎస్పి డాక్టర్ పక్కీరప్ప, ఎమ్మెల్యే కేతిరెడ్డి



భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే కేతిరెడ్డి, జిల్లా ఎస్‌పి పక్కీరప్ప



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కేతిరెడ్డి

**తాడిపత్రిఅర్బన్, అక్టోబర్ 6 ప్రభాతవార్త**

తాడిపత్రిలో ట్రాఫిక్‌పోలీసుస్టేషన్ ఏర్పాటుకు గురువారం ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి, జిల్లా ఎస్‌పి డాక్టర్ పక్కీరప్పలు భూమిపూజ చేశారు. పట్టణ పోలీసు స్టేషన్ పక్కన వున్న ఖాళీ స్థలంలో ట్రాఫిక్ పోలీసుస్టేషన్ నూతన భవన నిర్మాణానికి పండితుల వేదమంత్రాల నడుమ శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించి కొబ్బరికాయకొట్టి భూమిపూజ చేశారు. డిఎస్‌పి విఎన్‌కె చైతన్య ఆధ్వర్యంలో ఈ భూమిపూజ కార్యక్రమం జరిగింది. అనంతరం జిల్లా ఎస్‌పి, ఎమ్మెల్యే చేతుల మీదుగా ట్రాఫిక్ పోలీసుసిబ్బందికి అవసరమైన పరికరాలు అందచేశారు. అనంతరం జిల్లా ఎస్‌పి డాక్టర్ పక్కీరప్ప మాట్లాడుతూ తాడిపత్రి పారిశ్రామికంగా అభివృద్ధి చెందుతున్న ప్రాంతం కావడంతో నిత్యం ఇక్కడ ట్రాఫిక్ రద్దీ వుంటుందని ప్రమాదాల శాతం ఎక్కువేనన్నారు. ఎన్నో ఏళ్లుగా ట్రాఫిక్ పోలీసుస్టేషన్ ఏర్పాటు చేయాలని ఎన్నో వినతులు తమ శాఖకు వచ్చాయన్నారు. ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి రాష్ట్ర డిజిపితో మాట్లాడి త్వరితగతిన ట్రాఫిక్ పోలీసుస్టేషన్ ఏర్పాటుకు అవసరమైన అనుమతులను తీసుకరావడం ఆనందంగా వుందన్నారు. ఇటు తాడిపత్రి ప్రజలకు కూడా ట్రాఫిక్ వెతలు త్వరలో తప్పనున్నాయని పేర్కొన్నారు. ప్రమాదాలు కూడా తగ్గే అవకాశం వుందని ఆయన అభిప్రాయం వ్యక్తం చేశారు. ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు ఒక ఎస్ఐ స్థాయి అధికారితో పాటు 10 మంది సిబ్బందిని ఇప్పటి నుండే ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఎమ్మెల్యే కృషి వల్ల త్వరలోనే ట్రాఫిక్ పోలీసుస్టేషన్ నిర్మాణం పూర్తి అవుతుందని ఆయన తెలియచేశారు. అనంతరం ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి విలేకరులతో మాట్లాడుతూ జె.సి ప్రభాకర్‌రెడ్డి ఒక రకమైన అలర్జీతో బాధపడుతున్నాడన్నారు. వీరికి తాడిపత్రి ప్రాంత ప్రజల అభివృద్ధి గిట్టదన్నారు. వారు తప్ప వేరే వాళ్లు అభివృద్ధి చేస్తే మాత్రం ఆ అలర్జీ వారికి తీవ్రమవుతుందన్నారు. ట్రాఫిక్ పోలీసుస్టేషన్ ఏర్పాటు చేయబోయే స్థలం మున్సిపాలిటీదేనని ఆయన తన మనస్సాక్షిగా ప్రజలకు చెప్పాలన్నారు. పట్టణ పోలీసుస్టేషన్ పక్కన ట్రాఫిక్ పోలీసుస్టేషన్‌కు భూమి పూజ చేసిన స్థలం పోలీసుస్టేషన్‌దేనని అన్ని అనుమతులు తీసుకని ట్రాఫిక్ పోలీసుస్టేషన్‌కు భూమిపూజ నిర్వహించామన్నారు. తాడిపత్రిలో మున్సిపల్ ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించడానికి కారణం డిఎస్‌పి చైతన్య అని గతంలో పేర్కొన్న జె.సి ప్రభాకర్‌రెడ్డి సదరు డిఎస్‌పిపైనే తీవ్ర ఆరోపణలు చేస్తున్నారన్నారు. గతంలో పోలీసులను బెదిరించడం స్టేషన్లకు తాళాలు వేయడం తన అనుచరుల చేత పోలీసులపై దాడులు చేయిచడం ఇలాంటి చర్యలు జె.సి సోదరులకు తప్ప మరెవరికి తెలియవని ఇలాంటివి చేసే ఘనత వారికి మాత్రమే దక్కుతుందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డిఎస్‌పి విఎన్‌కె చైతన్య, పట్టణ సిఐ ఆనందరావు, రూరల్ సిఐ చిన్నపెద్దయ్య, పట్టణ ఎస్ఐ ధరణిబాబు, రూరల్ ఎస్ఐ మహమ్మద్‌గౌస్, పామిడి, గుత్తి, పుట్లూరు, సర్కిల్‌ఇన్‌స్పెక్టర్లు, ఎస్ఐలు, పోలీసు సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

03ATP06.qxd:03ATP06.qxd 07/10/22 10:14 PM Page 1



## అధైర్యపడకూ.. ప్రభుత్వం అండగా ఉంటుంది

- ఎంపిపి చిట్రెడ్డి జయలక్ష్మిసత్యనారాయణరెడ్డి



ద్రాక్ష పంటను పరిశీలిస్తున్న ఎంపిపి, అధికారులు

రాప్తాడు, అక్టోబర్ 6 (ప్రభాతవార్త)

మంగళవారం రాత్రి కురిసిన వర్షాలకు రాప్తాడు మండల పరిధిలోని గొందిరెడ్డి గ్రామానికి చెందిన ఈ. గంగరాజు అనే రైతు రెండు ఎకరాల్లో సాగు చేసిన ద్రాక్ష పంట పూర్తిగా నేలకొరిగిపోయింది. పంట చేతికొచ్చిన 25 నుంచి 30 టన్నుల దిగుబడి ఉన్న ద్రాక్ష పూర్తిగా దెబ్బతిన్న విషయాన్ని తెలుసుకున్న ఎంపివి. చిట్రెడ్డి జయలక్ష్మిసత్యనారాయణరెడ్డి, హార్టికల్చర్ అసిస్టెంట్ ఏడి. అధికారులను తీసుకెళ్లి ద్రాక్ష పంటను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపిపి మాట్లాడుతూ అధైర్య పడకూ.. ప్రభుత్వం అండగా ఉంటుందని రైతు గంగరాజుకు భరోసా ఇచ్చారు.

## ఘనంగా దుర్గాదేవి గ్రామోత్సవం

దుర్గాదేవి పూజలో పాల్గొన్న ఎంఎల్ఎ తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి

ఆత్మకూరు అక్టోబర్ 6 ప్రభాతవార్త



దుర్గాదేవిని గ్రామంలో ఊరేగిస్తున్న దృశ్యం

మండల పరిధిలోని పి.యాలేరు గ్రామంలో దసరా నవరాత్రులు ఘనంగా నిర్వహించారు.శ్రీలత ఆంథోనిరెడ్డి మిత్రమండలి ఆహ్వానం మేరకు రాప్తాడు ఎంఎల్ఎ తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి,జడ్పీఛైర్మెన్ బోయ గిరిజమ్మ దసరా పండుగరోజు పి.యాలేరులో నిర్వహిస్తున్న దుర్గాదేవి నవరాత్రుల పూజలో పాల్గొన్ని,అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. గురు వారం గ్రామంలో దుర్గాదేవి గ్రామోత్సవంలో అమ్మవారిని ఘనంగా మేళతాళాలతో ఊరేగింపు చేశారు.అమ్మవారి ప్రసాదమైన లడ్డును అనంతపురంకు చెందిన ప్రదీప్ 24 వేలు రూపాయలకు వేలంలో దక్కించుకున్నారు.గ్రామ ంలో దేవి నవరాత్రులు ఘనంగా నిర్వహించడానికి కారణమైన శ్రీలత అంథోనిరెడ్డిని గ్రామప్రజలు పూలమాలలు,శాలవతో ఘనంగా సత్కరించారు.

## మూడు రాజధానులతోనే అభివృద్ధి

-జెడ్‌పిటిసి భోగాతి ప్రతాప్‌రెడ్డి

యల్లనూరు, అక్టోబర్ 6 ప్రభాతవార్త

రాష్ట్రంలో అన్ని ప్రాంతాలు సమగ్రంగా అభి వృద్ధి చెందాలంటే మూడు రాజ ధానులు వుంటేనే అభివృద్ధి చెందుతుందని జెడ్‌పిటిసి భోగాతి ప్రతాప్‌రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని వెన్నపూసపల్లి గ్రామంలో పెద్దమ్మగుడి వద్ద టెంకాయలు కొట్టి పూజలు చేశారు. ఈ సందర్భంగా జెడ్‌పి



పెద్దమ్మగుడి వద్ద పూజలు చేస్తున్న జెడ్‌పిటిసి భోగాతి ప్రతాప్‌రెడ్డి

టిసి భోగాతి ప్రతాప్ రెడ్డి మాట్లాడుతూ అన్ని ప్రాంతాలు బాగుండాలి అందు లో అమరావతి వుండాల న్నదే మన ము ఖ్య మం త్రి జగనన్న అభిమత మని కేవలం రియల్ ఎస్టేట్ వ్యాపారం కోసమే చంద్రబాబు నాయుడు అమ రావతి పాట పాడు తు న్నా ర ని విమర్శించారు. ఒక ప్రాంతం అభివృద్ధిని మాత్రమే కోరుకునే వారి మనసులు మార్చాలని అమ్మవారిని వేడుకుంటూ విజయాలకు నెలవైన విజయదశమి రోజున పెద్దమ్మగుడి దగ్గర పూజలు నిర్వహించినట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు హరిచంద్రారెడ్డి, మహేశ్వర్‌రెడ్డి, పెద్దిరెడ్డి గోవర్ధన్‌రెడ్డి, కార్యకర్తలు పాల్గొన్నారు. అలాగే వేములపల్లి గ్రామంలో సర్పంచు అశోక్‌కుమార్‌రెడ్డి మూడు రాజధానులతోనే అభివృద్ధి అని పెద్దమ్మగుడి వద్ద పూజలు చేశారు.

## ఉచితంగా కంటి అద్దాలు పంపిణీ

పుట్లూరు, అక్టోబర్ 6 ప్రభాతవార్త

ఈ నెల 2వతేదీన ఎన్‌ఆర్‌ఐ రవినాయుడు కుమార్తె పుట్టిన రోజు



కంటి అద్దాలు పంపిణీ చేస్తున్న దృశ్యం

సందర ్భంగా తెలుగు అసోసియేషన్ ఆఫ్ నార్త్ అమెరికా (తానా) ఆధ్వర ్యంలో మండ లంలోని అర్కటివేముల గ్రామంలో ఉచిత కంటి వైద్యశిబిరం నిర్వహించి వైద్యపరీక్షలు నిర్వ హించిన విషయం విదితమే. కాగా గురు వారం 61 మందికి కంటి అద్దాలు పంపిణీ చేసి 40 మందిని శస్త్రచికిత్సల నిమిత్తం కడప పుష్పగిరి కంటి ఆసుపత్రికి పంపినట్లు టిడిపి మండల కన్వీనర్ బాలరంగయ్య, మాజీ సర్పంచు పొత్తూరు నారాయణ తెలిపారు. ఈ సందర ్భంగా వారు మాట్లాడుతూ తన గ్రామంలోని ప్రజలే కాకుండా మండల ప్రజల శ్రేయస్సు కూడా కోరడంలో తానా సభ్యులు రవినాయుడు ఆకాంక్షించారన్నారు. తాను పుట్టిన ఊరి అభివృద్ధి కోసం తమ కుటుంబం ముందుంటుందని తెలిపారు. ఈ కార ్యక్రమంలో తానా సభ్యులు అంజయ్యచౌదరి, పురుషోత ్తం, వెంకటరమణ, గ్రామస్తులు లక్ష్మీదేవి, రాజా, నల్లగొండరాయుడు, జగదీశ్వర్, సుబ్రమణ్యం, రాజశేఖర్ పాల్గొన్నారు.

## వైభవంగా డోలికోత్సవం

యాడికి, అక్టోబర్ 6 ప్రభాతవార్త

దసరా శరన్నవరాత్రి ఉత్స వాల్లో భాగంగా మండల కేంద్రంలోని శ్రీకన్యకా పరమేశ్వరిదేవి అమ్మవారిశాల లో గురువారం అమ్మవారి డోలికోత్స వం వైభవంగా జరిగింది. ఇందులో భాగంగా ఉదయం గణపతి పూజ, అర్చనలు, వసంతోత్స వం నిర్వహించారు. సాయంత్రం అమ్మవారికి డోలికోత్స వం నిర్వహించారు. పెద్దఎత్తున భక్తులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. హాజరైన భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.



అమ్మవారిని అలంకరించిన దృశ్యం

## కురువుల సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న దృశ్యం



కనకదాసు చిత్రపటానికి పూలమాలలు వేస్తున్న దృశ్యం

అనంతపురం, అక్టోబర్ 6 ప్రభాతవార్త బ్యూరో

హిందూపురంలోని శ్రీభక్తకనకదాస కళ్యాణమండపంలో కురువుల సమావేశం జరిగింది. ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు రెడ్డప్ప ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి హిందూపురం ఎంపి గోరంట్ల మాధవ్, తెలుగుదేశం పార్టీ సత్యసాయి జిల్లా అధ్యక్షులు బికె పార్థసారధి, బిసి కమీషన్ మెంబర్ రిటైర్డ్ జడ్జి కిష్టప్ప, కురువ సంఘం గౌరవాధ్యక్షులు నెమలవరం ఈశ్వరయ్య, రాయలసీమ జిల్లాల పట్టభద్రుల ఎంఎల్‌సి అభ్యర్థి బోరంపల్లి ఆంజనేయులు, డిప్యూటి కలెక్టర్ మధులత, డిప్యూటి సూపరింటెండెంట్ ఆఫ్ పోలీసు వెంకటరమణ, కురువ ఉద్యోగుల సంఘం అధ్యక్షులు వెంకటరమణ, ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్షులు కొనకొండ్ల ఈశ్వరయ్య, ఉద్యోగుల సంఘం అధ్యక్షులు పిడుగు శ్రీనివాసులు, కురువ ఉద్యోగుల సంఘం సలహాదారుడు కడదరకుండా మాజీ కురవ సంఘం గౌరవాధ్యక్షులు, లెక్చరర్ రిటైర్డ్ నారాయణ, ఆర్‌ఇఎఫ్ నాయకులు రామకృష్ణ, మల్లేష్, హిందూపురం బాలాజీ, సత్యసాయి జిల్లా నుండి కురువల ఉద్యోగులు, ఉపాధ్యాయులు, యువత, మహిళలు పెద్దఎత్తున హాజరయ్యారు. దాదాపు 150 మందికిపైగా ప్రోత్సాహక బహుమతులు అందచేశారు. ఈ సమావేశంలో హిందూపురం స్థానిక నాయకులు ఎంఇఒ గోపాల్, శేఖర్, జనార్ధన్, బాలాజీ, ఉపాధ్యాయులు, ఉద్యోగులు, కురువ సంఘం నేతలు హాజరయ్యారు. శ్రీసత్యసాయిబాబా ఉద్యోగుల సంఘం నేతలు ఉపాధ్యాయ సంఘం నేతలు యువజన సంఘం నేతలు మహిళా సంఘం నేతలు పట్టభద్రుల ఎంఎల్‌సి అభ్యర్థి బోరంపల్లి ఆంజనేయులుకు సంపూర్ణ మద్దతు ప్రకటించారు. దీంతో వారికి ఆయన ధన్యవాదాలు తెలిపారు.

## నేటి నుంచి డీఎస్సీ అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలన

అనంతపురం న్యూటౌన్, అక్టోబర్ 6 ప్రభాతవార్త

డీఎస్సీ-1998లో అర్హత పొంది, మినిమం టైం స్కేల్ క్రింద పనిచేయడానికి ఇది వరకే ఆన్‌లైన్‌లో అంగీకారం తెలిపి సర్టిఫికేట్లను అప్‌లోడ్ చేసిన అభ్యర్థులు ఒరిజినల్ సర్టిఫికెట్ల పరిశీలన ప్రక్రియ ఈనెల 7వ తేదీ నుంచి 12వ తేదీ వరకు నగరంలోని జిల్లా సైన్స్ సెంటర్‌లో నిర్వహిస్తున్నట్లు డీఈవో కె.శామ్యూల్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 7వ తేదీ 1 నుంచి100 వరకు, 8వ తేదీ 101 నుంచి 200 వరకు, 9వ తేదీ 201 నుంచి 300 వరకు, 10వ తేదీ 301 నుంచి 400 వరకు, 11వ తేదీ 401 నుంచి 500 వరకు, 12వ తేదీ 501 నుంచి 570 వరకు అభ్యర్థులు తమ ఒరిజినల్ డేట్ ఆఫ్ భర్త్, విద్యార్హత, కులధృవీకరణ పత్రాలను తప్పకుండా తీసుకురావాలన్నారు. ఒరిజినల్ సర్టిఫికెట్లు సమర్పించిన అభ్యర్థుల వివరాలను మాత్రమే పరిశీలించి ఆన్‌లైన్‌లో ఆమోదించడం జరుగుతుందని, సంబంధిత చెక్ లిస్ట్, అభ్యర్థుల జాబితా, ఇతర వివరాలు డీఈవోఅనంతపురం బ్లాగ్‌స్పాట్‌లో పొందుపరచడం జరిగిందని తెలిపారు.

## ఓపెన్‌స్కూల్ ప్రవేశాల గడువు పొడిగింపు

అనంతపురం న్యూటౌన్, అక్టోబర్ 6 ప్రభాతవార్త

ఏపి సార్వత్రిక విద్యాపీఠం (ఏపివోఎస్‌ఎస్) ద్వారా 2022-33 విద్యా సంవత్సరమునకు సంబంధించి పదో తరగతి, ఇంటర్మీడియట్ తరగతులలో అడ్మిషన్ పొందడానికి ఎటువంటి ఆలస్య రుసుము లేకుండా ఈనెల 15వ తేదీ వరకు గడువు పొడిగించినట్లు డీఈవో కె.శామ్యూల్, ఏసి గోవిందనాయక్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్హత, ఆసక్తి ఉన్న అభ్యాసకులు ఈ సదవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. 14 ఏళ్లు నిండిన వారు ఎవరైనా పదో తరగతిలో అడ్మిషన్ పొందవచ్చునన్నారు. 15 ఏళ్ల నిండి పదో తరగతి పాసైన వారు ఎవరైనా ఇంటర్‌లో అడ్మిషన్ పొంది ఒక్క సంవతన్సరంలోనే ఇంటర్‌పూర్తి చేసుకోవచ్చునన్నారు. అభ్యర్థులు స్వయంగా ఇంటర్‌నెట్, మీసేవ, ఏపి ఆన్‌లైన్ ద్వారా చేసుకున్న దరఖాస్తుతో పాటు ఒరిజినల్ సర్టిఫికెట్లు, రెండు సెట్లు జిరాక్సు కాఫీలను ఎంపిక చేసుకున్న స్టడీ సెంటర్‌లో అందజేసి దరఖాస్తులు కన్ఫర్మ్ చేసుకోవాలన్నారు. జిల్లా లేదా రాష్ట్ర స్థాయిలో కన్ఫర్మ్ అయిన తర్వాత అభ్యర్థి ఫోన్ నెంబర్‌కి వచ్చిన మిసేజ్ ఆధారంగా అభ్యర్థి స్వయంగా ఆన్‌లైన్ ద్వారా అడ్మిషన్ ఫీజు చెల్లించాలన్నారు. అడ్మిషన్ పొందిన వారు స్టడీ సెంటర్ వారు సెలవు దినములలో నిర్వహించే 30 పిసిపి తరగతులకు హాజరుకావాల్సి ఉంటుందన్నారు. అదనపు సమాచారం కోసం సంబంధిత వెబ్‌సైట్‌ను లేదా మీకు సమీపంలోని ఓపెన్‌స్కూల్ స్టడీ సెంటర్‌ను కానీ లేదా జిల్లా విద్యాశాఖ కార్యాలయంలోని ఓపెన్‌స్కూల్ విభాగంలో సంప్రదించాలని కోరారు.

## గాయపడిన కార్మికునికి ఆర్థిక సాయం

తాడిపత్రిటౌన్, అక్టోబర్ 6 ప్రభాతవార్త



ఆర్థిక సాయం అందచేస్తున్న మున్నా

కొన్ని రోజుల క్రితం గ్రానైట్ బండలు అన్‌లోడ్ చేస్తుండగా గ్రానైట్ బండ విరిగి కాలుమీద పడి సాయి అనే కార్మికునికి కాలు విరిగింది. విషయం తెలుసుకున్న గయాజ్‌బాష (మున్నా) 5 వేల రూపాయల ఆర్థిక సాయం అందచేశారు. అదేవిధంగా గ్రానైట్ ఫ్లోరింగ్ వర్కర్స్ అసోసియేషన్ అధ్యక్షులు రఫి, ఉపాధ్యక్షులు గౌస్, సభ్యులు ఖాన్, ఇంతియాజ్, హుస్సేన్‌లు 5 వేల రూపాయలు, బేల్దారి యూనియన్ అధ్యక్షులు గంగయ్య, ఉపాధ్యక్షులు నాగరాజు, ట్రెజరర్ రంగనాయకులు 2 వేలు రూపాయలు కలిపి మొత్తం 12 వేల రూపాయలకు కార్మికుడు సాయి కుటుంబానికి అందచేశారు. ఈ కార్య క్రమంలో తాడిపత్రి భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ సంఘం పట్టణాధ్యక్షులు వెంకట్, పెయింటర్స్ అసోసియేషన్ అధ్యక్షులు మాబు, షరీఫ్, వెల్డింగ్ వర్కర్స్ అసోసియేషన్ అధ్యక్షులు కుళ్లాయప్ప, భవన నిర్మాణ కార్మికులు పాల్గొన్నారు.

## వాహనాల తనిఖీ

అమడగూరు, అక్టోబర్ 6 ప్రభాతవార్త

మండలంలోని ఎంపిడిఒ కార్యాలయం ముందు చెక్‌పోస్టు వద్ద కర్నాటక నుండి వస్తున్న వివిధ వాహనాలను గురువారం ఎస్ఐ వెంకటనారాయణ సిబ్బందితో కలిసి తనిఖీలు చేపట్టారు. వాహనదారులతో ఎస్ఐ మాట్లాడుతూ ప్రతి ఒక్క వాహనానికి ఇన్సూరెన్స్, ఆర్‌సి తప్పనిసరిగా వుండాలన్నారు. ద్విచక్రవాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలన్నారు. వాహనదారులు కెపాసిటికి మించి ప్రయాణీకులను ఎక్కించుకోరాదని ఎస్ఐ తెలిపారు. ఈ దాడుల్లో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## ఎమ్మెల్యేను మర్యాద పూర్వకంగా కలసిన ఎమ్మెల్సీ, ఎమ్మెల్సీ అభ్యర్థులు



ఎమ్మెల్యేను కలసిన ఎమ్మెల్సీ, ఎమ్మెల్సీ అభ్యర్థులు

కదిరి, సెప్టెంబర్ 6, ప్రభాతవార్త

కదిరి ఎమ్మెల్యే డాక్టర్ పివి సిద్దారెడ్డిని ఆయన క్యాంపు కార్యాలయంలో గురువారం గుంటూరు, క్రిష్ణా జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ కల్పలతారెడ్డి, పశ్చిమ రాయలసీమ ఉపాధ్యాయ, పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థులు రామచంద్రారెడ్డి, వెన్నపూస రవీంద్రారెడ్డిలు మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర ్భంగా ఎమ్మెల్యే కదిరి నియోజకవర్గ పరిధిలోని ప్రజా ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. మార్చి నెలలో జరగబోవు శాసనమండలి ఎన్నికలలో నవంబర్ 7వ తేదీ వరకూ జరుగు ఓటర్ల నమోదు కార్యక్రమంలో విరివిగా పాల్గొని తమ సహకారం అందించాలన్నారు. ప్రతి గ్రాడ్యుయేట్‌తో తప్పనిసరిగా ఓటు నమోదు చేయించే విధంగా చూడాలన్నారు. వైఎస్సార్ సిపి బలపరిచిన అభ్యర్థులను గెలిపించాలని ఎమ్మెల్యే కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర పర్సన్ నజిమున్నిసాసాదిక్; వైస్ చైర్మెన్ రాజశేఖర్‌రెడ్డి, ఎంపిపిలు రాము, రమణారెడ్డి, తోట అమర్నాథ్‌రెడ్డి, తాతం జగన్‌మోహన్, మహమ్మద్‌రఫినాయక్; ఎస్టీసెల్ క్రిష్ణానాయక్; కన్వీనర్ చంద్రశేఖర్‌రెడ్డి, ఉపాధ్యాయులు, వైసిపి నాయకులు పాల్గొన్నారు.

## వరినాట్లు వేసి నిరసన తెలిపిన సిపిఎం





వరినాట్లు వేసి నిరసన తెలుపుతున్న సిపిఎం

కదిరి టౌన్, సెప్టెంబర్ 6, ప్రభాతవార్త

కదిరి పట్టణంలోని హిందూపురం క్రాస్ నుండి కోనేరు వరకూ తారు రోడ్డును మరమ్మత్తు చేయాలని కోరుతూ గురువారం సిపిఎం నాయకుల ఆధ్వర్యంలో వరినాట్లు వేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సిపిఎం పట్టణ కార్యదర్శి జిఎల్ నరసింహులు, జగన్‌మోహన్, హరినాథరెడ్డిలు మాట్లాడుతూ కోనేరు వరకూ ఉన్న రోడ్డు మొత్తం పెద్దపెద్ద గుంతల మయమై ఉందన్నారు. చిన్నపాటి వర్షం వస్తే ఈ రోడ్డు మొత్తం వర్షపు నీటితో నిండిపోయి వాహనదారులకు, పాదచారులకు తీవ్ర అవరోధంగా మారిందన్నారు. ఆర్‌అండ్‌బి శాఖ అధికారులు తాత్కాలికంగా మరమ్మత్తులు చేయడం మానుకుని శాశ్వతంగా రోడ్డు వేసి ప్రజలకు వెసలుబాటు కల్పించాలని డిమాండ్ చేశారు. స్థానిక ప్రజా ప్రతినిధులు స్పందించి తక్షణం రోడ్డుపై పడిన గుంతలను పూడ్చివేసి మరమ్మత్తులు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు రామో ్మహన్, ముస్తాక్, బాబ్‌జాన్, ఫాజిల్, క్రిష్ణానాయక్; పూల నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

## నకిలీ విత్తనాలు, మందులు అమ్మితే కఠిన చర్యలు

- ఏడిఏ క్రిష్ణయ్య



రికార్డులను పరిశీలిస్తున్న ఏడిఏ

ఓబుళదేవరచెరువు, సెప్టెంబర్ 6, ప్రభాతవార్త

రైతులకు నకిలీ విత్తనాలు, పురుగు మందులు అమ్మితే కఠిన చర్యలు తప్పవని ధర్మవరం ఏడిఏ కృష్ణయ్య ఫర్టిలైజర్ దుకాణ దారులకు స్పష్టం చేశారు. మండలంలోని ఓడిసి, కొండకమర్ల ఫర్టిలైజర్ షాపులను గురువారం ఆయన తనిఖీ చేశారు. షాపులు, గోడౌన్‌లలో ఎరువులు, పురుగు మందులు, విత్తనాల స్టాకును పరిశీలించారు. అనంతరం ఆయన మాటా ్లడుతూ రికార్డులలో కొనుగోలు, అమ్మకపు వివరాలను ఎప్పటికప్పుడు నమోదు చేయాలన్నారు.ప్రభుత్వం నిర్ణయించి ధరలకు మాత్రమే ఎరువులు, క్రిమిసంహారక మందులు, విత్తనాలు అమ్మాలన్నారు. ప్రతి రైతుకు తప్పనిసరిగా బిల్లు ఇవ్వాలన్నారు. ప్రభుత్వం అమోదించిన పురుగుమందులు, ఎరువులను మాత్రమే విక్రయించాలని నిబంధనలు అతిక్రమించిన వారి లైసెన్స్‌లు రద్దు చేస్తామని హెచ్చరించారు.

## నేడు కుమ్మరవాండ్లపల్లి-2లో గడపగడపకు

కదిరి, సెప్టెంబర్ 6, ప్రభాతవార్త

కదిరి మండల పరిధిలోని కుమ్మరవాండ్లపల్లి-2 గ్రామ సచివాలయ పరిధిలోని మత్తులగారిపల్లి, బాలప్పగారిపల్లిలో నేడు (శుక్రవారం) గడపగడపకు మనప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొంటారని ఎంపిపి తోట అమర్నాథ్‌రెడ్డి, ఎంపిడిఓ సుధామణి ఒక ప్రకటనలో తెలియచేశారు. కావున మండలానికి చెందిన వివిధ శాఖల అధికారులు, ప్రజా ప్రతినిధులు హాజరు కావాలన్నారు. ఈ కార ్యక్ర మానికి సచివాలయ సిబ్బంది తప్పనిసరిగా యూనిఫాం ధరించి రావాలన్నారు.

## ప్రతి దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించాలి

నంబులపూలకుంట, అక్టోబర్ 6, ప్రభాతవార్త:

ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన ఓ పంపిణీ స్కీమ్ ద్వారా అధిక సంఖ ్యలో సాగు భూమి రైతుల నుండి ధరఖాస్తులు రావడం జరిగింది. కావున వచ్చిన ప్రతి ధరఖాస్తును పరిశీలించి ప్రతి అర్జీదారుడు అసలైన సాగుభూమిదారుడా లేదా అనే విషయాన్ని క్షుణ్ణంగా పరిశీలించి సర్వే చేయాలని తహసిల్దార్ రవినాయక్ సర్వేయర్‌లు సూచించారు.

## ఘనంగా జ్యోతుల ఊరేగింపు

యాడికి, అక్టోబర్ 6 ప్రభాతవార్త

యాడికి పట్టణంలో గురువారం ఉదయం రెండు జ్యోతులను ఊరేగించారు. రాఘవేంద్రకాలనీ మొదలుకొని పురవీధుల్లో జ్యోతులను తలపై పెట్టుకుని చౌడేశ్వరి అమ్మవారి గేయాలని ఆద్యంతం ఆలపిస్తూ ఉత్స వం సాగింది. ప్రతి ఏడాది తొగటవీరక్షత్రియుల చిన్నగుంపు ఆధ్వర్యంలో విజయదశమి పండుగ సందర్భంగా జ్యోతులను నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. ఉత్స వాన్ని తిలకించేందుకు పెద్దఎత్తున భక్తులు తరలివచ్చారు.



జ్యోతులు ఊరేగిస్తున్న దృశ్యం

## ఎస్‌పిని కలిసిన వాల్మీకి కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్



ఎస్‌పిని సత్కరిస్తున్న సజ్జలదిన్నె రాజు

తాడిపత్రిటౌన్, అక్టోబర్ 6 ప్రభాతవార్త

తాడిపత్రి పట్టణ పోలీసుస్టేషన్‌లో జిల్లా ఎస్‌పి డాక్టర్ పక్కీరప్పను గురువారం వాల్మీకి కార్పోరేషన్ రాష్ట్ర డైరెక్టర్ సజ్జలదిన్నె రాజు మర్యాద పూర్వకంగా కలిశారు. తాడిపత్రి పట్టణంలో ట్రాఫిక్ పోలీసుస్టేషన్ నూతన భవనం నిర్మాణానికి భూమిపూజ కార్యక్రమానికి విచ్చేసిన ఎస్‌పిని సజ్జలదిన్నె రాజు కలిసి శాలువాతో సత్కరించారు.

## ఘనంగా శ్రీకన్యకాపరమేశ్వరిదేవి రథోత్సవము



శ్రీకన్యకాపరమేశ్వరి రథం ఊరేగింపు నిర్వహిస్తున్న దృశ్యం

తాడిపత్రిటౌన్, అక్టోబర్ 6 ప్రభాతవార్త

శరన్నవరాత్రి ఉత్స వాల్లో భాగంగా పట్టణంలో శ్రీకన్యకాపరమేశ్వరిదేవి రథోత్స వము బుధవారం రాత్రి ఘనంగా నిర్వహించారు. ఉత్స వాల్లో భాగంగా ఉదయం అమ్మవారికి అభిషేకాలు, అర్చనలు తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అమ్మవారి ఉత్స వ విగ్రహాన్ని ప్రత్యేకంగా అలంకరించిన రథంపై వుంచి పురవీధుల్లో మేళతాళాలు, బాణసంచా నడుమ అంగరంగవైభవంగా ఊరేగింపు నిర్వహించారు. పెద్దఎత్తున భక్తులు అమ్మవారిశాలకు చేరుకుని అమ్మవారిని దర్శించుకున్నారు. హాజరైన భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. ఉత్స వాల్లో భాగంగా గాంధీకట్ట వద్ద తమిళనాడు వారిచే ప్రత్యేకంగా 16 అడుగుల ఎత్తు చందనముతో అలంకరించబడిన శ్రీవాసవి కన్యకాపరమేశ్వరిదేవి విశ్వరూప దర్శనం ఆకట్టుకుంది. గ్రామోత్స వం సందర్భంగా మహాత్మాగాంధీ సర్కిల్‌లో లంకా దహన కార్యక్రమం భక్తులకు కనువిందు చేసింది. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం అధ్యక్ష, కార్యదర్శులు సురేంద్రనాథ్, బచ్చు సుబ్రమణ్యం, జయవరం అశ్వర్థరంగయ్య, భూమా సుబ్రమణ్యం, వంకదార చిన్నమద్దులేటి (రాజ), కుల్లూరు శేషఫణి, పెద్దఎత్తున భక్తులు పాల్గొన్నారు.

## నేడే సింగంపల్లిలో గడప-గడపకు మన ప్రభుత్వం

ఆత్మకూరు అక్టోబర్ 6 ప్రభాతవార్త

మండల పరిధిలోని సింగంపల్లి గ్రామలంలో గడప-గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం శుక్రవారం నిర్వహిస్తున్నామని వైఎస్ యంపిపి నీలమ తెలియజేశారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సింగంపల్లిలో నిర్వహించే గడప-గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో రాప్తాడు ఎంఎల్ఎ తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి పాల్గొంటున్నారని తెలిపారు.కావున మండల కన్వీనర్లు, ఎంపిటిసిలు, జడ్పీటీసీ,సర్పంచ్‌లు, కార్యకర్తలు,గ్రామ సచివాలయం సిబ్బంది, వాలంటీర్లు,వైసిపీ ముఖ్య నాయకులు,అభిమానులు,ప్రతి ఒక్కరూ పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పేర్కొన్నారు.

## వైభవంగా దసరా వేడుకలు



శమీవృక్షం దర్శనానికి వెళుతున్న భక్తులు

తాడిపత్రిఅర్బన్, అక్టోబర్ 6 ప్రభాతవార్త

పట్టణంలో బుధవారం దసరా వేడుకలు ఘనంగా జరిగాయి. ఉదయాన్నే ప్రజలు స్నానాది కార్యక్రమాలు నిర్వహించి కొత్త వస్త్రాలు ధరించి ఆలయాలకు చేరుకుని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తుల



చింతలరాయుడు, బుగ్గరామలింగేశ్వరున్ని దర్శించుకుంటున్న భక్తులు

రద్దీతో పట్టణంలోని శ్రీచింతల వేంకటరమణస్వామి, శ్రీబుగ్గరామలింగేశ్వర స్వామి, అమ్మవారిశాల, శ్రీసత్యనారాయణస్వామి ఆలయం, శ్రీచౌడేశ్వరిదేవి, శ్రీగాయత్రిదేవి, శ్రీమార్కండేయస్వామి ఆలయాలు కిక్కిరిసిపోయాయి. ఉదయం ఆయా ఆలయాల్లో అమ ్మవారికి అభిషేకాలు, కుంకుమార్చనలు తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించారు. సాయంత్రం తూర్పు పాలెంలోని జమి ్మచెట్టు వద్దకు భక్తులు చేరుకుని చుట్టూ ప్రదక్షిణలు చేసి పూజలు చేశారు. జమ్మిఆకులు తెచ్చి పెద్దలకు ఇచ్చి ఆశీర్వాదాలు పొందారు. పండుగ సందర్భంగా ఆలయాలను వివిధ రకాల పుష్పాలు, విద్యుత్ దీపాలతో ప్రత్యేకంగా అలంకరించారు.

## వైభవంగా గరుడోత్సవం

తాడిపత్రి అర్బన్, అక్టోబర్ 6 ప్రభాతవార్త



గరుడవాహనంపై స్వామివారిని ఊరేగిస్తున్న శ్రీవారు

పట్టణంలోని శ్రీచింతల వేంకటరమణస్వామి ఆలయంలో శ్రీవారి బ్రహో ్మత్స వాల్లో భాగంగా స్వామివారి గరుడోత్స వం గురువారం వైభవంగా జరిగింది. ఉత్స వాల్లో భాగంగా ఉదయం స్వామి వారికి ఆలయ అర్చకులు మురళీస్వామి అభిషేకాలు, అర్చనలు తదితర పూజా కార్యక్రమాలను నిర్వహించారు. అనంతరం సాయంత్రం శ్రీదేవి, భూదేవి సమేత శ్రీవారిని వివిధ రకాల పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించి గరుడవాహనంపై పురవీధుల్లో ఊరేగింపు నిర్వహించారు. స్వామివారికి అత్యంత ప్రీతిపాత్రమైన గరుడోత్స వం కావడంతో పట్టణం నుండేకాకుండా పరిసర గ్రామాల నుండి పెద్దఎత్తున భక్తులు ఈ ఉత్స వంలో పాల్గొని స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేకపూజలు జరిపారు. అనంతరం హాజరైన భక్తులకు తీర్థప్రసాదాలను అందచేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ బాణా నాగేశ్వర్‌రెడ్డి, ఇఒ సుబ్రమణ్యం, సభ్యులు నాగిశెట్టి సంజన్న, భూమా హరి, కనకాద్రి లక్ష్మీదేవి, మద్యాల లత, సందేపాకుల రమాదేవి, మల్లెల నారాయణమ్మ, పెద్దఎత్తున భక్తులు పాల్గొన్నారు.

# నిర్దేశిత సమయంలోగా భూ హక్కు పత్రాల పంపిణీ కొరకు కృషి చేస్తాం

## -శ్రీసత్యసాయి జిల్లా కలెక్టర్ బసంత్‌కుమార్



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ బసంత్‌కుమార్

**శ్రీసత్యసాయిజిల్లా, అక్టోబర్ 6, ప్రభాతవార్త ప్రతినిధి:**

శ్రీసత్యసాయి జిల్లాలో జగనన్న శాశ్వత భూహక్కు, భూరక్ష పథకంలో భాగంగా నిర్దేశించిన గడువులోగా భూ హక్కు పత్రాల పంపిణీ కొరకు కృషి చేస్తామని శ్రీసత్యసాయి జిల్లా కలెక్టర్ బసంత్‌కుమార్ తెలియజేశారు. గురువారం విజయవాడ సిసిఎల్ఎ కార్యాలయం నుండి రీ సర్వే, వైఎస్ఆర్ జగనన్న శాశ్వత భూహక్కు మరియు భూరక్ష పత్రాల మంజూరు తదితర అంశాలపై అన్ని జిల్లాల కలెక్టర్‌లతో స్పెషల్ చీఫ్ సెక్రెటరీ జి.సాయిప్రసాద్ నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో కల్టెర్ బసంత్కుమార్, సర్వే ఆఫ్ ల్యాండ్ రికార్డ్స్ ఎడి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సిసిఎల్ఎ స్పెషల్ చీఫ్ సెక్రెటరీ సాయిప్రసాద్ మాట్లాడుతూ, సమగ్ర సర్వే పూర్తయిన రెండు వేల గ్రామాలకు నవంబర్ 01 లేదా 02వ తేదీలలో ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి భూ హక్కు పత్రాలను పంపిణీ చేసే అవకాశం ఉన్నందున ఈ నెల 15 నాటికి కలెక్టర్లు భూ హక్కు, భూరక్ష పత్రాలు మంజూరు చేయబోయే పట్టాదారుల వివరాలను నిశితంగా పరిశీలించి తమకు పంపాలని కోరారు. దీనిపై స్పందించిన జిల్లా కలెక్టర్ బసంత్‌కుమార్ భూ హక్కు పత్రాలకు సంబంధించి ఒకటికి రెండు సార్లు పక్కాగా పరిశీలన చేయడం జరుగుతుందన్నారు. రీ సర్వే చేసిన భూములకు సంబంధించి ఐదు గ్రామాలకు భూ హక్కు పత్రాలు వచ్చాయని, భూ హక్కు పత్రాలను ఒకటికి రెండు సార్లు పరిశీలించడం జరుగుతోందన్నారు. కొంత మంది రైతులు ఫోటోలు, ఆధార్‌కార్డు, ఇతర వివరాలను ఇవ్వాల్సి ఉందని, వాటిని త్వరగా అందిస్తే భూ హక్కు పత్రాలను పక్కాగా అందించేందుకు వీలుంటుందన్నారు. గడువులోగా రీ సర్వే మ్యూటేషన్లపై చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. అలాగే కోర్టు పరిధిలో ఉండే భూ సమస్యలపై కోర్టు జారీ చేసే ఉత్తర్వులను పరిశీలించి తదుపరి చర్యలు తీసుకుంటామన్నారు.

**ప్రాధాన్యత భవనాలు త్వరితగతిన పూర్తి చేయండి :** పంచాయతీ రాజ్ శాఖ ద్వారా చేపడుతున్న ప్రభుత్వ ప్రాధాన్యత భవనాలను త్వరితగతిన పూర్తి చేయాలని పంచాయతీ రాజ్ మరియు గ్రామీణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి గోపాలకృష్ణ ద్వివేది జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. గురువారం స్థానిక కలెక్టర్ కార్యాలయంలో రైతుభరోసా కేంద్రాలు, సచివాలయాలు, జలకళ, జగనన్న కాలనీల్లో మౌళిక సదుపాయాల కల్పన తదితర అంశాలపై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఆయా శాఖ అధికారులు ప్రతి వారం సమీక్షలు నిర్వహించి ప్రగతి కనబరిచేలా కలెక్టర్లు చర్యలు తీసుకోవాలన్నారు. నిర్మాణాలకు అవసరమైన సిమెంట్, ఇటుక, ఇనుము, అందుబాటులో ఉన్నాయని, నిధుల సమస్య కూడా లేదని స్పష్టం చేశారు. జిల్లాలో పనులు వేగవంగా చేయాలన్న ఆయన, ఉపాధి హామీ కాంపోనెంట్ నిధులతో చేపడుతున్న పనుల్లో మరింత శ్రద్ధ వహించాలన్నారు. జలకళలో మిగిలి ఉన్న పనులను త్వరితిగతిన పూర్తి చేయాలని, జనన్న కాలనీల్లో రహదారులు, తాగునీరు, విద్యుత్, కాలువలు వంటి మౌళిక వసతులు పూర్తి కావాలన్నారు. ప్రారంభం కాని రైతుభరోసా కేంద్రాలు, సచివాయాలను త్వరితగతిన ప్రారంభించాలని, ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలను సకాలంలో పూర్తి చేయాలని కలెక్టర్లను ఆదేశించారు. ఈ కార్యక్మంలో శ్రీసత్యసాయి జిల్లాకలెక్టర్ బసంత్‌కుమార్, డిఆర్ఓ కొండయ్య, డ్వామా పిడి రామాంజినేయులు, పిఆర్ సూపరింటెండెంట్ ఇంజనీర్ గోపాల్ రెడ్డి, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్‌సిఇ రషీద్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# నేడు జిల్లాకు రానున్న మంత్రి గుమ్మనూరు జయరాం



**పుట్టపర్తిరూరల్, అక్టోబర్ 06, ప్రభాతవార్త**

రాష్ట్ర శ్రామిక, ఉపాధి, పరిశ్రమల శాఖా మంత్రి, శ్రీసత్యసాయి జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి అయిన గుమ్మనూరు జయరాం శుక్రవారం జిల్లా కేంద్రమైన పుట్టపర్తి పర్యటిస్తున్నట్లు అధికార వర్గాలు తెలిపాయి. ఉదయం 06:00 గంటలకే ఆయన సొంత నియోజకవర్గమైన ఆలూరు నుండి బయలుదేరి 10:30 గంటలకు పుట్టపర్తి చేరుకుంటారని, 11:00 గంటలకు కలెక్టరేట్‌లో జరిగే ఫ్యామిలీ ఫిజిషియన్ కార్యక్రమంలో పాల్గొంటున్నట్లు తెలియజేశారు. అనంతరం మధ్యాహ్నం 02:00 గంటలకు తిరుగు ప్రయాణమై సాయంత్రం 06:30 గంటలకు ఆలూరు చేరుకోనున్నట్లు తెలియజేశారు.

# మహాగని కల్ప వృక్షం సాగు రైతులకు ఓ వరం

## - ఎకరాకు కోటి దాకా ఆదాయం

**రాయదుర్గం టౌన్, అక్టోబర్ 6 ప్రభాతవార్త :**



వేపుగా ఉన్న మహాగని కల్ప వృక్షం

రాయదుర్గం మండల పరిసర ప్రాంతాల్లో సాగు నష్టాల సాక్షిగా అప్పుల ఊబిలో చిక్కుకుని రైతులు ఉసురు తీసుకుంటున్నారు. పత్తి, మిరప వంటి పంటలు దిగుబడి సరిగా రాక వాటికి సరైన గిట్టుబాటు ధరలు లభించక రైతులు కోలుకోలేని స్థితికి చేరుతున్నారు. తెచ్చిన రుణాలు నుంచి గట్టెక్కే దారి కనబడక అయోమయంగా ఉంటున్న రైతులకు మహాగని కల్పవృక్షం ఒక మంచి ఆదాయ వనరుగా చతుర్వేద అనే ఒక బృహత్తర కంపెనీ వారు తెలిపారు. వ్యవసాయశాఖలో సుమారు 35 ఏళ్ల అనుభం గల జాయింట్ డైరెక్టర్ అగ్రికల్చర్ ప్రభుత్వ అధికారిగా సేవ చేసి రైతుల భాగోగులు క్షుణ్ణంగా పరిశీలన చేసి ఈ శుభార్తను అందజేస్తున్నానని డాక్టర్ సుధాకర్‌రావు తెలిపారు. దాని వల్ల ఉపయోగాలను వివరిస్తూ.. ఈ మహాగని వృక్ష సంపదతో రైతులకు ఎకరానికి గ్యారంటిగా కోటి నుంచి ఒకటిన్నర కోటి ఆదాయాన్నిచ్చే ఒక బృహత్తరమైన పంటగానే చెప్పవచ్చునన్నారు. కాబట్టి ఈ పరిస్థితుల్లో మహాగని అనే ఒక వృక్షం ప్రపంచంలో విలువైన కలపను అందించగల ఏకైక వృక్షం స్వీటి నియ, మైక్రో పిల్ల కింగ్, మాహగని మాత్రమే అన్నారు. ఈ వృక్షం యొక్క క్వాలిటి రంగు బ్రౌన్, రెడ్, కలర్‌లో ఉండి ఆ టెంపర్ యొక్క క్వాలిటి. పెద్ద పెద్ద హోటళ్ల ఫ్లోరింగులకు గాని, ఫర్నిచర్లకు, బోట్స్ తయారీలకు అనేక రకమైన మ్యూజిక్ ఇన్‌స్టూమెట్స్ లకు వేల్యూ ఫర్నిచర్స్ తయారు చేయడానికి ఈ కలపను ఉపయోగిస్తారన్నారు. ఈ కలప యొక్క డిమాండ్ ప్రపంచంలో చాలా ఉందన్నారు. కాబట్టి రైతులు ఈ కలప యొక్క డిమాండ్‌ను దృష్టిలో పెట్టుకుని ఈ మహాగని వృక్ష సంపదను అభివృద్ధి చేసినట్లయితే రైతులకు చాలా లాభదాయకంగా మంచి ఆర్థిక పరిపుష్టి పొందుతారని ఆయన తెలిపారు. ఈ మొక్క ఒకసారి నాటితే ఎటువంటి సైడ్ కొమ్మలు ఉండకుండా ఇది డైరెక్టుగా పోడవుగా పెరిగే వృక్షమని దీనికి ఎటువంటి ప్రకృతి వైపరీత్యాలు వచ్చినా.. ఏ రకమైనటువంటి అవరోధాలు కలిగినా ఈ మొక్క కేమి కాదని ఆయన తెలిపారు. ఈ మొక్క 12 సంవత్సరాల లోపు దీని యొక్క కాండం చుట్టూ కొలత సుమారు 3 అడుగుల నుంచి 4 అడుగుల వరకు ఏర్పడుతుందన్నారు. కాబట్టి ఈ మొక్క ఒకటిన్నర కోటి వరకు నికర లాభాన్ని పొందుతారని ఆయన వివరించారు. అంతేకాకుండా అంతర్జాతీయంగా ఈ కలపకు మంచి డిమాండ్ ఉందని , ఈ కలపకు ఏ టేకు కలప కూడా సాటి రాదని ఆయన తెలిపారు.

# వర్ష ప్రభావిత ప్రాంతాల్లో పర్యటించిన ఎమ్మెల్యే అనంత.....

## - ఆక్రమణలు,అక్రమ కట్టడాలను వెంటనే తొలగిస్తాం ఎమ్మెల్యే





వర్షం నీరు చేరిన ప్రాంతాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే అనంత,అధికారులతో చర్చిస్తున్న ఎమ్మెల్యే అనంత

**అనంతపురం రూరల్,అక్టోబర్06ప్రభాతవార్త:**

వర్షపు నీరు చేరిన కాలనీ ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా తగిన చర్యలు నిర్వహించమని ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి తెలిపారు. గురువారం అనంత రూరల్ మండలం రుద్రంపేట గ్రామ పంచాయితీలోని వర్ష ప్రభావిత ప్రాంతాల్లో స్థానిక సర్పంచ్‌సుగాలిపద్మావతి, ఆర్‌డిఓ మధుసూధన్, తహశీల్దార్ శ్రీధరమూర్తి,డీఎస్పీ శ్రీనివాసులు, రుద్రంపేట ప్రాంతానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించి సత్వరమే సహాయ చర్యలు చేపట్టాలని ఆదేశించి ఆయన దగ్గర నుండి పనులు చేయించి వంక దాటే ప్రజలు ఎటువంటి ఇబ్బందులు పడకుండా అగ్నిమాపకశాఖ,పోలీసులుశాఖ అధికారులను పిలిపించి తాడు సాయంతో ప్రజలు వంక దాటించే చర్యలు చేపట్టారు.అక్రమణల కారణంగానే ఇలాంటి పరిస్థితి వచ్చిందని తక్షణం అక్కడ అక్రమ కట్టడాలను





ప్రజలను తాడు సహాయంతో వంక దాటిస్తున్న పోలీసులు , నీరు పారుతున్న వంకలో పైపులు వేచి మట్టి తోలిస్తున్న సర్పంచ్,అధికారులు.

పంచాయితీ కార్యదర్శి నరసింహారెడ్డి,ఎంపిటిసిలు, నాయకులతో కలిసి అనంత అర్బన్ ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి పర్యటించారు. బుధవారం రాత్రి నుంచి పైతట్టు ప్రాంతాల్లో వర్షం ఎడతెరిపి లేకుండా కురుస్తుండడంతో నీటి ప్రవాహం అధికమై రుద్రంపేట నుంచి ఆలమూరుకు వెళ్లె రహదారిలో నూతనంగా నిర్మిస్తున్న బ్రిడ్జీ వద్ద రాకపోకలు స్తంభించిపోవడంతో ఆ విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే అనంత వెంటనే ఆర్‌డిఓ మధుసూధన్,తహశీల్దార్ శ్రీధరమూర్తి,సర్పంచ్ సుగాలి పద్మావతి, పంచాయితీ కార్యదర్శి నరసింహారెడ్డిలతో మాట్లాడి నేరుగా రాకపోకలు స్తంభించిన తొలగించేందకు చర్యలు తీసుకుంటామని ఆర్‌డిఓ మధుసూధన్ తెలిపారు.అనంతరం పంచాయితీలోని విశ్వశాంతి నగర్ జలమయం కావడంతో డీఎస్పీ శ్రీనివాసులతో కలిసి ఎమ్మెల్యే అక్కడికి వెళ్లి అక్కడి పరిస్థితులు అడిగి తెలుసుకుని పరిస్థితిని సమీక్షించారు.కాలనీలో అక్రమణలు జరిగాయని తెలియడంతో పేదలు ఉంటే వారికి ప్రత్యామ్నాయంగా ఇంటి స్థలాలు అందించేందుకు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. లోతట్టు ప్రాంతాల్లో నివాసించే ప్రజలు అంతా అప్రమత్తంగా ఉండాలని కోరారు.

# గవర్నర్‌కు ఘన స్వాగతం



గవర్నర్‌కు స్వాగతం పలుకుతున్న శ్రీసత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ మేనేజింగ్‌ట్రస్టీ ఆర్.జె.రత్నాకర్



విమానాశ్రయంలో గవర్నర్‌కు స్వాగతం పలుకుతున్న జిల్లా కలెక్టర్ బసంత్‌కుమార్

**పుట్టపర్తిటౌన్, అక్టోబర్ 06, ప్రభాతవార్త**

రాష్ట్ర గవర్నర్ బిశ్వభూషన్ హరిచందన్‌కు సత్యసాయి విమానాశ్రయంలో ఘనస్వాగతం లభించింది. బుధవారం గన్నవరం నుండి ప్రత్యేక విమానంలో ఉదయం 11:10 గంటలకు గవర్నర్ పుట్టపర్తిలోని శ్రీసత్యసాయి విమానాశ్రయం చేరుకున్నారు. అక్కడ హిందూపురం ఎంపి గోరంట్ల మాధవ్, ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్ రెడ్డి, జిల్లా కలెక్టర్ బసంత్‌కుమార్, ఎస్‌పి రాహుల్‌దేవ్ సింగ్, ఆర్‌డిఓ భాగ్యరేఖ తదితరులు గవర్నర్‌కు స్వాగతం పలికారు. అక్కడి నుండి నేరుగా శాంతిభవన్ అతిథి గృహం చేరుకున్న గవర్నర్‌కు శ్రీసత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ ఆర్.జె.రత్నాకర్, ఇతర ప్రతినిధులు స్వాగతం పలికారు. అక్కడి నుండి సాయి కుల్వంత్ సభ మందిరంలో గల శ్రీసత్యసాయి బాబా మహాసమాధిని గవర్నర్ దర్శించుకున్నారు. అనంతరం ట్రస్ట్ వర్గాలు గవర్నర్‌కు బాబా చిత్రపటాన్ని బహూకరించి సన్మానించారు. శాంతిభవన్‌లో మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి, టిడిపి నాయకులు బెస్తచలపతి, రామాంజినేయులు, సామకోటి ఆదినారాయణ, తదితరులు గవర్నర్‌ను మర్యాదపూర్వకంగా కలుసుకొని పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ కార్యక్రమాలు ముగించుకొని గవర్నర్ మధ్యాహ్నం ఇక్కడి నుండి తిరుగుప్రయాణమయ్యారు.

# నేల కూలిన ద్రాక్ష పంట

## - రూ. 15 లక్షలు ఆస్తి నష్టం



నేల కూలిన ద్రాక్ష పంటను పరిశీలిస్తున్న సీపీయం నాయకులు

**రాప్తాడు, అక్టోబర్ 6 ప్రభాతవార్త**

అధిక వర్షాలు కురువడంతో రైతులుసాగు చేసిన పంటలు దెబ్బతిన్నాయని రాష్ట్ర ప్రభుత్వం రైతులకు నష్ట పరిహారం అందించి ఆదుకోవాలని సిపియం పార్టీ జిల్లా కార్యదర్శి వి. రాంభూపాల్‌రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాప్తాడు మండల పరిధిలోని గొందిరెడ్డి పల్లి గ్రామం నందు ఈ. గంగరాజు అనే రైతుకు చెందిన రెండు ఎకరాలలో సాగు చేసిన ద్రాక్ష పంట పూర్తిగా నేలకోరిగి పంట పూర్తిగా దెబ్బదని.. దీంతో రూ. 15 లక్షలు నష్టం వాటిల్లిందని ఆ రైతు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సీపీయం నాయకులు రైతుతో వివరాలు అడిగి తెలుసుకోగా.. రెండు ఎకరాల్లో సాగు చేసిన ద్రాక్ష పంట 30 టన్నుల వరకు పూర్తిగా దెబ్బతిన్నదని.. దీంతో రూ. 15 లక్షలు నష్టం వాటిల్లిందని ఆవేదన వ్యక్తం చేస్తూ రైతు తెలిపారు. ఇంజరీంగ్ చదువుకున్న రైతు ఈ.గంగరాజుకు ప్రభుత్వ అదికారులు ప్రభుత్వం పంట నష్టపరిహారం అంచనా వేసి నివేదికలు ప్రభుత్వానికి పంపి నష్ట పరిహారం అందించాలని డిమాండ్ చేశారు. ఈకార్యక్రమంలో మండల అధ్యక్షులు పోతులయ్య, ఆదినారాయణరెడ్డి, నూరుల్లా,రైతులు ఉన్నారు.

# జగన్ అమలు చేస్తున్న సంక్షేమ అభివృద్ధి పథకాలే మాకు వరం

## - ఏ పార్టీ పురుడు పోసుకున్నా ప్రజా బలం మావైపే ఉంది - కదిరి ఎమ్మెల్యే డాక్టర్ పివి సిద్ధారెడ్డి

**కదిరి, సెప్టెంబర్ 6, ప్రభాతవార్త :**

రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టే అమలు చేస్తున్న అభివృద్ధి పథకాలే మాకు శ్రీరామరక్ష అని కదిరి ఎమ్మెల్యే డాక్టర్ పివి సిద్ధారెడ్డి స్పష్టం చేశారు. ఎమ్మెల్యే క్యాంపు కారా ్యలయంలో గురువారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఎమ్మెల్యే సిద్ధారెడ్డి మాట్లాడుతూ గత 40 సంవత్సరాల సుదీర్ఘ ప్రస్థానంలో ప్రతిపక్ష పార్టీ నేత రాష్ట్ర సంక్షేమాన్ని, అభివృద్ధిని పూర్తిగా విస్మరించిన సంగతి జగమెరిగిన సత్యం అన్నారు. ప్రజా స్వామ ్యంలో కొత్త పార్టీలు పురుడు పోసుకోవడం రాజకీయాల్లో ఒక భాగం అని వాటిని స్వాగతిస్తున్నామన్నారు. కొత్త పార్టీల రాజకీయ క్రీడల్లో తాము ఏ మాత్రం ఇసుమంతైనా చెక్కుచెదిరే పరిస్థితి తమ అధినేత తమకు కల్పించలేదన్నారు. తమ అధినేత మూడున్నర పాలనలో రాష్ట్రాన్ని నభూతో నభవిష్యత్ అన్న చందాన పురోగమణదిశగా తీసుకుపోతూ అన్ని వర్గాలను సంతృప్తి పరచి ప్రజల సంక్షేమమే అజెండాగా పనిచేస్తూ ముందుకు పోతున్నామన్నారు. తాము ప్రజలకు చేస్తున్న విశిష్ట సేవలు ప్రభుత్వ పథకాల అమలు చేసిన తీరును బట్టి ప్రజలను నిర్భయంగా ఓట్లు అడిగేశక్తి తమ పార్టీకే ఉందన్న సంగతి అన్ని పార్టీలు ఒక్కసారి మననం చేసుకోవాలని ఆయన హితవు పలికారు. భవిష్యత్తు రాజకీయ చదరంగంలో అడుగులు వేయడానికి కొత్త పార్టీలు పుట్టుకురావడం సహజమేనని అలాంటి పార్టీలకు ప్రజలే తగిన తీర్పును ఇచ్చి చాపచుట్టేస్తారని ఎమ్మెల్యే సిద్ధారెడ్డి స్పష్టం చేశారు.



ఎమ్మెల్యే సిద్ధారెడ్డి

# రాష్ట్రస్థాయి జూడో, రెజ్లింగ్ పోటీల్లో రజత, కాంస్య పతకాలు సాధించిన వ్యాయామ ఉపాధ్యాయుడు

## -నేటి నుండి యుపీలో జరిగే జాతీయ పోటీల్లో పాల్గొననున్న దాసరి నరసింహం



**ఉరవకొండ, అక్టోబర్ 6 ప్రభాతవార్త :**

నియోజకవర్గంలోని వజ్రకరూరు మండలం కొనకొండ్ల గ్రామంలోగల మహాత్మా జ్యోతిరావు పూలే (పెన్నహోబిళం) బాలుర గురుకుల పాఠశాలలో వ్యాయామ ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న దాసరి నరసింహం రాష్ట్రస్థాయి జూడో పోటీల్లో రజతం, రెజ్లింగ్‌లో పోటీల్లో కాంస్య పతకాలు సాధించారు. సెప్టెంబర్ 28, 29 తేదీల్లో తిరుపతి రేణిగుంటలోని జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో 66కేజీల విభాగంలో మంచి ప్రతిభ కనబర్చి ఆయా క్రీడల్లో ద్వితీయ, తృతీయ స్థానంలో నిలిచాడు. నవంబర్ 7 నుంచి 10వ తేదీ వరకు ఉత్తర్‌ప్రదేశ్‌లోని గోండలో జరిగే జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొంటున్నాడు. వ్యాపాయ ఉపాధ్యాయ దాసరి నరసింహంను తోటి ఉపాధ్యాయులు, గ్రామస్థులు అభినందించారు. జాతీయ పోటీల్లోనూ పతకాన్ని సాధించాలని ఆకాంక్షించారు.

రజత, కాంస్య పతకాలు సర్టిఫికేట్లతో వ్యాయామ ఉపాధ్యాయుడు దాసరి నరసింహం

# భవిష్యత్తు టిడిపిదే.. పెరుమాళ్ళ జోస్యం

## - కాలువ శ్రీనివాసులు రాజకీయకంగా ఉన్నత పదవులను అధిరోహించాలి

## - ఘనంగా కాలువ శ్రీనివాసులు జన్మదినోత్సవ వేడుకలు



కాలువ శ్రీనివాసులు సన్మానిస్తున్న పెరుమాళ్ళ జీవానందరెడ్డి

**పామిడి, అక్టోబర్ 06 ప్రభాతవార్త**

భవిష్యత్తు తెలుగుదేశంపార్టీదే అని రాబోవు ఎన్నికల్లో పార్టీ విజయం సాధించి చంద్రబాబునాయుడు తిరిగి ముఖ్యమంత్రి అవుతారని ఆపార్టీ సీనియర్ నాయకులు, పిజేఆర్ ట్రస్టు వ్యవస్థాపకులు పెరుమాళ్ళ జీవానందరెడ్డి జోస్యం చెప్పారు. అనంతపురం జిల్లా టిడిపి అద్యక్షులు, మాజీ మంత్రి కాలువ శ్రీనివాసులు జన్మదినోత్సవాన్ని పురుష్కరించుకుని బుధవారం ఆపార్టీ సీనియర్ నాయకులు, పిజేఆర్ ట్రస్టు వ్యవస్థాపకులు పెరుమాళ్ళ జీవానందరెడ్డి కాలువ శ్రీనివాసులు ఇంటికి చేరుకుని ఆయనను ఘనంగా సన్మానించిన అనంతరం జన్మదినోత్సవ కేక్‌ను కట్‌చేసి టిడిపి శ్రేణులతో కలిసి సంబరాలను జరుపుకున్నారు. ఈసందర్భంగా పెరుమాళ్ళ జీవానందరెడ్డి మాట్లాడుతూ జిల్లా రాజకీయాల్లో అపార అనుభవాన్ని ఘడించిన కాలువ శ్రీనివాసులు రాజకీయ ఉద్దండుడుగా గుర్తింపు పొందారాన్నరు. దేశ వ్యాప్తింగా టిడిపిని విస్తరింపజేసిన చంద్రబాబునాయుడు ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా ప్రజాభ్యున్నతికి పాటుపడ్డాదని ఆయన పాలనలో ప్రజంతా సుభిక్షంగా ఉన్నారని తెలిపారు. చంద్రబాబునాయుడు ప్రభుత్వంలో రాష్ట్ర మంత్రిగా పని చేసిన కాలువ శ్రీనివాసులు రాష్ట్ర, జిల్లా అభివృద్ధి, ప్రజాసంక్షేమం, పార్టీ నిర్మాణానికి ఎనలేని కృషి చేశారని కొనియాడారు. కార్యకర్తలకు ఎలాంటి సమస్యలు ఎదురైనా తక్షణం స్పందిస్తూ వారికి అండగా ఉంటున్న కాలువ శ్రీనివాసులు రాజకీయంగా ఉన్నత పదవులను అధిరోహించాలని ఆకాంక్షిస్తూ ఆయనకు పరమేశ్వరుడు ఆయురారోగ్యాలను ప్రసాదించాలని మనస్ఫూర్తిగా వేడుకుంటున్నట్టు పెరుమాళ్ళ జీవానందరెడ్డి వెల్లడించారు. ఈకార్యక్రమంలో టిడిపి నాయకులు, పిజేఆర్ ట్రస్టు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



జన్మదినోత్సవ కేక్‌ను కట్ చేయిస్తున్న పెరుమాళ్ళ జీవానందరెడ్డి

# వన్యప్రాణుల సంరక్షణ జాగృతికై మోటార్‌బైకు ర్యాలీ

**బళ్లారి, అక్టోబర్06, ప్రభాతవార్త ;** వన్యప్రాణుల సంరక్షణకై అటవీశాఖ చేపట్టిన 'వైల్డ్‌లైఫ్ వీక్' జాగృతి కార్యక్రమం నేపథ్యంలో నగరంలోని సంజీవని చారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షుడు, కార్పొరేటర్ ఎం.ప్రభంజన్‌కుమార్ నేతృత్వంలో బుల్లెట్ మోటార్‌బైకుల ర్యాలీని గురువారంనాడు ప్రారంభించారు. స్థానిక కనకదుర్గమ్మ దేవస్థానం ఆవరణలో జిల్లా అటవీశాఖ ఉపసంరక్షణాధికారి సందీప్‌సూర్యవంశీ ర్యాలీకి పచ్చజెండా ఊపి ప్రారంభించారు. ర్యాలీకి నేతృత్వం వహించిన ఎం.ప్రభంజన్‌కుమార్ మాట్లాడుతూ రాష్ట్రంలోనే బళ్లారి జిల్లా తనదైన విశిష్టతను కలిగి ఉన్నదని, అపారమైన ప్రకృతి సంపద కలిగి ఉన్న బళ్లారి జిల్లాలో అనేక రకాల వన్యప్రాణులు ఆవాసం కలిగి ఉన్న జిల్లాగా పేరు ఉన్నదని, అయితే నగరాలు, పట్టణాలు జిల్లాలో పెరిగిపోతుండడంతో కొన్ని వన్యప్రాణుల సంతతి తగ్గిపోతున్నదని, కావునా వన్యప్రాణుల సంరక్షణ మనందరి బాధ్యతగా ఉన్నదని, దీనిపై ప్రజల్లో జాగృతి కల్పించేందుకు ఈ బైకుర్యాలీ చేపట్టినట్లు పేర్కొన్నారు. వన్యప్రాణుల సంరక్షణపై ప్రజల్లో అవగాహన కల్పించే నిమిత్తం చేపట్టిన మోటార్ బైకు ర్యాలీని క్రమంగా రెండోసారి ప్రారంభించినట్లు తెలిపిన ఆయన, కనకదుర్గమ్మ దేవస్థాన సర్కిల్ నుంచి ప్రారంభమయ్యే ఈ ర్యాలీ హంపీ సమీపంలో గల కమలాపుర జులాజికల్ పార్కు వరకు వెళ్లి అక్కడి నుంచి దరోజీ ఎలుగుబంట్ల సంరక్షణ కేంద్రం, అనంతరం సండూరు, గుడేకోట ఎలుగుబంట్ల సంరక్షణ కేంద్రం మీదుగా తిరిగి బళ్లారికి బైకు ర్యాలీ చేరుకుంటుందన్నారు. ఇందులో పాల్గొంటున్న బైకు రైడర్‌లు తమతమ వాహనాల నడుమ తగినంత అంతరం ఉండేలా ప్రయాణం సాగిస్తారని చెప్పారు. ఎవరూ ఈ ర్యాలీలో వేగంగా బైకులు నడపకూడదని, 60 కి.మీ. మించి బైకులు నడపరాదని, ట్రాఫిక్ ఉన్న చోట్ల బైక్‌లను పూర్తిగా నెమ్మదిగా నడిపేలా రైడర్‌లకు సూచించినట్లు తెలిపారు. ఈ సందర్భంలో డాక్టర్ ఎస్.కె.అరుణ్‌తో పాటు అటవీశాఖ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



మోటార్ బైకు ర్యాలీని ప్రారంభిస్తున్న అటవీ సంరక్షణాధికారి సందీప్‌సూర్యవంశీ